క్లుప్తంగా

నేడు మండల సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న ఎంపీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి

వీరబల్లి : మండల సర్వసభ్య సమావేశం బుధవారం (నేడు) నిర్వహించనున్నట్లు ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథ్ రెడ్డి తెలిపారు. ఉదయం 10:30కు ప్రారంభమయ్యే సమావేశానికి మండలంలోని జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మండల ఆయాశాఖల అధికారులు పాల్గొనాలని కోరారు. కాగా మంగళవారం ఎంపీపీ తన కార్యాలయంలో మండలస్థాయి అధికారులతో సమావేశమయ్యారు. బుధవారం జరిగే సమావేశంపై వివిధ అంశాలు, ప్రజల సమస్యలు గురించి ముందుగా చర్చించారు. ఈ కార్యక్రమంలో మండల వైఎస్సార్‌సీపీ నాయకులు, వైఎస్సార్‌సీపీ పంచాయతీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గాలివీటి వీరనాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంజన్నకు విశేష పూజలు



పూజల్లో పాల్గొన్న భక్తులు

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు పట్టణంలోని గాండ్లవీధిలో వెలసియున్న ఆంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం భక్తులు ఘనంగా పూజలు చేశారు. ఉదయం నుంచి మూలవిరాట్‌కు పంచామృత అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అలాగే భక్తులందరూ సహస్రనామాలతో అంజన్నకు ఆకుపూజ జరిపించారు.

గ్రంథాలయ అభివృద్ధి కమిటీ ఎంపిక



మాట్లాడుతున్న నిర్వాహకుడు సుధాకర్

ఓబులవారిపల్లె : వైకోట గ్రంథాలయ అభివృద్ధి కమిటీని మంగళవారం ఎన్నుకున్నట్లు నిర్వాహకులు సుధాకర్ తెలిపారు. అధ్యక్షుడిగా బజారు వెంకటేశ్వర్లు, కార్యదర్శిగా కొమ్మెద్దుల వెంకటరమణ, కోశాధికారిగా మోరముట్ల శంకరయ్య, గ్రంథాలయ కమిటీ సభ్యులుగా కె.నాగభుషణం, చిన్న వెంకటసుబ్బయ్య, బి.రత్నబాబులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైకోట గ్రంథాలయ అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామన్నారు.

గ్రామాలలో సమస్యలపై దృష్టి పెట్టండి



ఎంపీడీఓను సత్కరిస్తున్న వైస్ ఎంపీపీ ధ్వజారెడ్డి

రైల్వేకోడూరు అర్బన్ : మండలంలోని గ్రామాలలో నెలకొన్న సమస్యలపై దృష్టి పెట్టాలని మంగళవారం వైస్ ఎంపీపీ, వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షులు రామిరెడ్డి ధ్వజారెడ్డి ఎంపీడీఓ ఆర్.నాగిరెడ్డిని కోరారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎంపీడీఓను కలిసి పలు సమస్యలపై సమీక్షించారు. ప్రస్తుతం గ్రామాల్లో జ్వరాల విజృంభిస్తున్న నేపథ్యంలో పారిశుధ్య నిర్వహణకు ప్రాధాన్యత ఇస్తూ మిగతా సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతామని ఎంపీడీఓ తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సీహెచ్ రమేష్, బండారు మల్లికార్జున, రమణ, రత్తయ్య, రాజా, డీపీ రమణ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

వాహన తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న ఎస్ఐ రామకృష్ణ

గాలివీడు : ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించి సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.మంగళవారం గాలివీడు - రాయచోటి ప్రధాన రహదారి గ్యాస్ గోడౌన్ వద్ద ఎస్ఐ తన సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీలు నిర్వహించారు. నిబంధనలు పాటించని వారికి జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్, కారు నడిపేవారు సీట్ బెల్ట్ ధరించాలన్నారు. వాహనాలకు సంబంధించి అర్హత పత్రాలతో పాటు ట్రాఫిక్ నియమాలు తప్పనిసరిగా పాటించాలన్నారు.

రోగులకు పండ్లు పంపిణీ

రాజంపేట/రాయచోటి టౌన్ : రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ పుట్టిన రోజు సందర్భంగా స్థానిక ప్రాంతీయ వైద్యశాల, రాయచోటిలోని వైద్యశాలలో రోగులకు ఆయా ప్రాంతాల బీజేపీ నాయకులు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శిథిలావస్థకు చేరబడి..

- ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనన్న ఆందోళన
- ఆరుబయటే పాఠాలు బోధిస్తున్న టీచర్లు
- ఫిర్యాదులు చేసినా పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు
- నూతన బడి నిర్మించాలంటున్న దళితవాడ ప్రజలు

పాఠశాలలో ఉండాలంటే భయంగా..



నా పేరు రేవంత్, నేను నాల్గో తరగతి చదువుతున్నాను. మా పాఠశాల పూర్తిగా పాడైపోయింది. పై కప్పు పెచ్చులు ఊడిపోయాయి. పాఠాలు వినాలంటే ఎక్కడ పెచ్చులు మీద పడతాయో అని భయంగా ఉంది. వర్షం వస్తే పాఠశాల గోడలన్నీ నీటితో తడుస్తున్నాయి. మాకు నూతన పాఠశాల భవనం కట్టించండి.

– రేవంత్, నాల్గోతరగతి, ఎంపీపీ పాఠశాల, నరవకాటిపల్లి దళితవాడ, ఒంటిమిట్ట మండలం



పెచ్చులూడిన నరవకాటిపల్లి దళితవాడ ఎంపీపీ పాఠశాల పైకప్పు



తేలికపాటి వర్షానికే నెమ్ముచేరిన పాఠశాల గోడ

ఒంటిమిట్ట : బడులు విద్యార్థుల బతుకులను మార్చే విధంగా ఉండాలి. కానీ ఒంటిమిట్ట మండలం నరవకాటిపల్లి పంచాయతీ దళితవాడలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల బతుకులను బలిచేసే స్థితికి చేరుకుంది. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనన్న ఆందోళనతో విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. తల్లిదండ్రులు ఆ పాఠశాలకు పంపితే ఎక్కడ తమ పిల్లలు జీవితం మధ్యలోనే ముగిసిపోతుందోనని భయానికి గురవుతున్నారు. పాఠశాల సమస్యల పరిష్కారం గురించి కలవని అధికారులు, ప్రజాప్రతినిధులు లేరు. విద్యార్థులకు సురక్షితమైన చదువును అందించే బాధ్యత ప్రభుత్వానికి లేదా అంటూ తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు.

సమస్యల సడి.. ఆ బడి

నిర్వహణ లోపమో.. అధికారుల నిర్లక్ష్యమో విద్యార్థులకు శాపంగా మారింది. ఎన్నో జీవితాలు మలిచే శక్తి బడులకు సొంతం. అలాంటి బడుల స్థితిగతులే బాగుండకపోతే బడిలో విద్యార్థులు చదువుపై శ్రద్ధ ఎలా చూపగలరన్న వాదన నరవకాటిపల్లి గ్రామప్రజల నుంచి వినవస్తోంది. మండలంలోని నరవకాటిపల్లి దళితవాడ ప్రాథమిక పాఠశాల సమస్యలు ఏళ్ల నుంచి పరిష్కారం కాలేదు. ఉన్నది ఒకేఒక్క తరగతి గది అది కూడ పెచ్చులూడి పడుతుండటంతో ఇటు విద్యార్థులు అటు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు భయభ్రాంతులవుతున్నారు. అలానే మండలంలో పలు పాఠశాలలు దెబ్బతిని ప్రమాదకరంగా మారాయి. పిల్లలకు చదువు చెప్పాలా లేక ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందో టీచర్లు తలలు పట్టుకుంటున్నారు. ఇక చేసేదేమీలేక పాఠశాలను వదిలి విద్యార్థులకు ఆరు బయటే విద్యను బోధించడం కనిపిస్తోంది. నూతన పాఠశాలను నిర్మించాలని ఆ గ్రామవాసులు అడగని అధికారి కానీ, ప్రజా ప్రతినిధులుగానీ లేరు. ఓట్ల సమయంలో వచ్చిన ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్తే తమను గెలిపించండి మీకు కొత్త పాఠశాలను నిర్మిస్తాం అంటారే తప్పా గెలిచిన తరువాత ఇటువైపు కన్నెత్తి చూడరని దళితవాడ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

విద్యకు ప్రాధాన్యత ఏది

రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్ని సంక్షేమ పథకాలు ఇచ్చినా ప్రజలు మాత్రం ముఖ్యంగా కోరేది ఉన్నత విద్య, వైద్యం. కానీ ప్రజలకు కావాల్సిన ముఖ్యమైన రెండింటిలో రాబోయే తరాలకు ఉన్నత చదువులు చదివించి, వారి భవిష్యత్తును బంగారు బాటలోకి తీసుకెళ్లే పాఠశాలల అభివృద్ధిని మాత్రం కూటమి ప్రభుత్వం పట్టించుకోలేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా పాఠశాలలో మొత్తం 45 మంది విద్యార్థులు, ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్నారు. సోమవారం శిథిలావస్థలో ఉన్న పాఠశాలను నూతనంగా నిర్మించాలని ఆ వాడ ప్రజలు జెడ్పీ సీఈఓ ఓబులమ్మకు వినతి పత్రం అందజేశారు. అలాగే గ్రామ పంచాయతీ ఇంజనీరింగ్ అసిస్టెంట్ కూడా వచ్చి పరిశీలించినట్లు ఆ పాఠశాల హెచ్ఎం సుజాత అన్నారు. పైకప్పు మరమ్మతులు చేసేందుకు అనువుగాలేదని, నూతన భవనం నిర్మించాలని సూచించినట్లు పేర్కొన్నారు. ఇంజనీరింగ్ సిబ్బంది సలహాలను దృష్టిలో ఉంచుకొని తమ పిల్లలకు నూతన పాఠశాల భవనాన్ని నిర్మించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.



భయంతో ఆరుబయటే ఉన్న విద్యార్థులు

కొత్త బడిని నిర్మించండి



నా పేరు కుంభగిరి నరసింహ, నా ఇద్దరు పిల్లలు ఈ పాఠశాలలోనే చదువుతున్నారు. ప్రస్తుతం పాఠశాల భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో భయంగా ఉంది. ప్రభుత్వం శిథిలావస్థకు చేరిన పాఠశాలలను నూతనంగా నిర్మించాలి. లేకుంటే ఏదో ఒకరోజు పెచ్చులూడి విద్యార్థులు గాయాలపాలవుతారు.

– కుంభగిరి నరసింహ, విద్యార్థుల తండ్రి, నరవకాటిపల్లి దళితవాడ, ఒంటిమిట్ట మండలం

విన్నవించినా.. పరిష్కారం కాలేదు



మా వాడలోని ఎంపీపీ పాఠశాల శిథిలావస్థకు చేరుకుంది. దీనిపై అధికారులకు సమస్య పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రాలు సమర్పించాం.. ప్రజాప్రతినిధులను వేడుకున్నాం, కానీ పరిష్కారానికి నోచుకోలేదు. ఇప్పటికైనా భవనాన్ని నిర్మించి విద్యార్థులకు భద్రత కల్పించాలి.

– కుంభగిరి బాలరాజు, వైస్ చైర్మన్, ఎంపీపీ పాఠశాల

విద్యార్థులు అవస్థలు పడుతున్నారు

ఎంపీపీ పాఠశాల భవనం పూర్తిగా దెబ్బతింది. పైకప్పు పెచ్చులు ఊడుతున్నాయి. గోడలకు నీరు చేరుతున్నాయి. దీంతో విద్యార్థుల బోధనకు అవస్థలు ఎదురవుతున్నాయి. మంగళవారం ఇంజనీరింగ్ అసిస్టెంట్ పాఠశాల నూతన భవనం నిర్మించాలని సూచించారు. ఇవన్నీ చూస్తే పాఠశాలకు నూతన భవనం నిర్మిస్తే బాగుంటుంది. విద్యార్థులకు ఇబ్బందులు తీరుతాయి.

– సుజాత, ఎంపీపీ పాఠశాల టీచర్, నరవకాటిపల్లి దళితవాడ, ఒంటిమిట్ట మండలం

ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం

పాఠశాల శిథిలావస్థ చేరుకున్న స్థితిపై పలు మార్లు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. వారి వద్ద నుండి ఎలాంటి అనుమతులు రాలేదు. అనుమతులు రాగానే పాఠశాల సమస్య పరిష్కారానికి పనులు చేపడతాం. విద్యార్థులకు భద్రతకు ప్రాధాన్యత ఇస్తాం.

– బ్రహ్మయ్య, ఎంఈఓ-2, ఒంటిమిట్ట మండలం

నేటి నుంచి 'స్వస్త్ నారీ సశక్త్ పరివార్' అభియాన్

నందలూరు : స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం నేటి నుంచి ప్రారంభమవుతుందని మండల ప్రభుత్వ వైద్యులు డాక్టర్ శరత్‌కమల్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ కార్యక్రమంలో భాగంగా మహిళలకు వైద్య పరీక్షలు, ఆరోగ్యానికి దోహదం చేసే ఆహారపు అలవాట్లు, దీర్ఘకాలిక వ్యాధులకు చికిత్సతోపాటు చిన్నారుల ఆరోగ్య భద్రత తీసుకోవాల్సిన చర్యలను వివరిస్తామన్నారు. వచ్చే నెల 2వ తేదీ మహాత్మా గాంధీ జయంతి వరకు కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ఈ నెల 17న మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అవగాహనా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో జరిగే కార్యక్రమ వివరాలను ఆయా ప్రాంతాల ఆశ కార్యకర్తలు, ఆరోగ్య కార్యకర్తలను అడిగి తెలుసుకోవాలని శరత్‌కమల్ తెలియజేశారు.

చెయ్యేరులోకి దిగితే కఠిన చర్యలు

రాజంపేట రూరల్ : పింఛా డ్యామ్ నుంచి ఈ రోజు దిగువనున్న చెయ్యేరులోకి నీటిని విడుదల చేసినందున ఎవరూ నదిలోకి దిగరాదని తహసీల్దార్ ఎస్.పీర్‌మున్నీ మంగళవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. చెయ్యేరు నది పరీవాహక ప్రాంత ప్రజలు, లోతట్టు ప్రాంత ప్రజలు, పశువులు, గొర్రెల కాపరులు, చేపలు పట్టే వారితో పాటు రైతులు, ప్రజలు ఎవరూ నదీ తీరం దగ్గరకు వెళ్లరాదని తెలియజేశారు. అలా కాకుండా చెయ్యేరులోకి దిగితే కఠిన చర్యలు తప్పవని పేర్కొన్నారు.

అవగాహనతోనే హెచ్ఐవీ నివారణ

ఒంటిమిట్ట : చాప కింద నీరులా విస్తరిస్తున్న మహమ్మారి హెచ్ఐవీపై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలని మండల వైద్యాధికారి డాక్టర్ భావన ప్రజలకు సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో ఆమె రోగులు, మండల ప్రజలకు హెచ్ఐవీపై ఎల్ఈడీ స్క్రీన్ సహాయంతో వీడియోల ద్వారా అవగాహన కల్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మన దేశంలో హెచ్ఐవీ కేసులు అధికంగా ఉన్న రాష్ట్రాల్లో మన రాష్ట్రం రెండవ స్థానంలో ఉందని చెప్పుకొచ్చారు. ప్రతి ఒక్కరు హెచ్ఐవీ నివారణ చర్యలను తెలుసుకుని, ఒకరి నుంచి మరొకరికి వ్యాప్తి చెందకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. హెచ్ఐవీ బాధితుల పట్ల వివక్ష చూపడం నేరమని, ఇది అంటు వ్యాధి కాదని తెలియజేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సూపర్‌వైజర్ భాస్కర్ రెడ్డి, ల్యాబ్ టెక్నీషియన్ రాజు, 108 నాగబాబు, ఓబులయ్య తదితరులు పాల్గొన్నారు.

వీఓఏల సమస్యలు పరిష్కరించాలి



ధర్నా నిర్వహిస్తున్న వెలుగు యానిమేటర్లు

రాయచోటి టౌన్ : వీఓఏల (వెలుగు యానిమేటర్లు) సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ.రామాంజులు డిమాండ్ చేశారు. మంగళవారం రాయచోటి పట్టణంలోని రాజుల కాలనీలోని వెలుగు కార్యాలయం ఎదుట వీఓఏలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలం చెల్లిన 64 సర్క్యులర్ రద్దు చేసి ఎనిమిది నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సెర్ప్, డీఆర్‌డీఏ అధికారులతో కలిసి యానిమేటర్లను తొలిగిస్తుండటాన్ని తప్పుబట్టారు. కార్యక్రమంలో నాయిమేటర్ల సంఘం జిల్లా అధ్యక్షులు రాణి, కోశాధికారి సుబ్రహ్మణ్యం, రెడ్డెప్పరెడ్డి, కృష్ణమ్మలు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రిని తాము కలిశామని ఆ సందర్భంలో ఉద్యోగాల తొలిగింపునకు తాము వ్యతిరేకమని, ఎవరినీ తొలిగించమని నమ్మబలికారని విమర్శించారు. చోటమోటా నాయకుల ఆగడాలు ఎక్కువయ్యాయని వారిని అరికట్టకపోతే ఉద్యమించాల్సి వస్తుందని హెచ్చరించారు. కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని వెలుగు పీడీ రాజేశ్వరావుకు అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి డి.భాగ్యలక్ష్మి, రమణారెడ్డి, రాజగోపాల్, నరసమ్మ, రమణారెడ్డి, నాగమణి, పవన్, కృష్ణారెడ్డి, శంకరమ్మ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి వృథా.. నిర్లక్ష్యపు వ్యథ

సిద్దవటం : మాధవరం-1 పంచాయతీ రోడ్డు నెం-13లో తాగునీటి పైప్‌లైన్ లీకై 15 రోజులు అవుతున్న ఎవరూ పట్టించుకోవడంలేదని స్థానికులు తెలిపారు. సమస్యపై మంగళవారం స్థానికులు మాట్లాడుతూ పైప్‌లైన్ లీకేజీ గురించి పలుమార్లు పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్‌ల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదన్నారు. ఇదిగో వస్తాం అదిగో చేస్తాం అంటున్నారే తప్పా మరమ్మతులు చేసిన పాపానపోలేదు. దీంతో నీరు వృథా అవ్వడమే కాక నీరు నిలవడమే కాక స్థానికులు అక్కడే చెత్త వేయడంతో దుర్గంధంతోపాటు దోమలు వృద్ధి చెందుతున్నాయన్నారు. అధికారులు స్పందించి పైప్‌లైన్‌కు మరమ్మతులు చేయాలని కోరుతున్నారు. కాగా సర్పంచ్ ఇంటికి కూతవేటు దూరంలోనే పైప్‌లైన్ లీకేజీ గురైన పరిష్కారం చేయకపోవడంపై ప్రజలు పెదవి విరుస్తున్నారు.



లీక్ అవుతున్న తాగునీటి పైపులైన్

ప్రతి విద్యార్థి హిందీలో నిష్ణాతులవ్వాలి

నందలూరు : నేడు ఆంధ్ర రాష్ట్రంలోని ప్రతి విద్యార్థి హిందీలో నిష్ణాతులవ్వాలని జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడు, హిందీ పండిట్ మహమ్మద్ షఫీవుల్లా పేర్కొన్నారు. మంగళవారం స్థానిక శ్రీ అన్నమాచార్య అకాడమీ హైస్కూల్‌లో కరెస్పాండెంట్ సమ్మెట శివప్రసాద్ ఆధ్వర్యంలో హిందీ భాషా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా షఫీవుల్లా మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రానికి వెళ్లిన అక్కడ స్థానిక భాష రాకపోయినా హిందీ ఉపయోగపడుతుందన్నారు. కేంద్ర స్థాయిలో కొన్ని ఉద్యోగాలకు హిందీ భాష పండితులకు ప్రత్యేకంగా ఒక కోట ఉందని చెప్పారు. ఈ సందర్భంగా పాఠశాల కరెస్పాండెంట్ సమ్మెట శివప్రసాద్, ప్రధానోపాధ్యాయుడు ఏనుగుల బాలాంజనేయులు, డైరెక్టర్లు మాడపూరి హేమలత, సమ్మెట ఉమామహేశ్వరరావు ఉత్తమ ఉపాధ్యాయుడు అవార్డు గ్రహీత షఫీవుల్లాను పాఠశాలలో హిందీ పండిట్‌గా పనిచేస్తున్న ఇబ్రహీం ఖలీలుల్లా, మల్లికాభాను ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు.



షఫీవుల్లాను సత్కరిస్తున్న అన్నమాచార్య అకాడమీ సిబ్బంది

ప్రతి ఆటోడ్రైవర్‌కు వాహనమిత్ర అమలు చేయాలి

రాయచోటి జగదాంబసెంటర్ : ఎలాంటి షరతులు లేకుండా ఆటో నడిపే ప్రతి ఆటోడ్రైవర్‌కు వాహనమిత్ర పథకం ద్వారా రూ.25 వేలు ఇవ్వాలని, ఈఎస్ఐతో కూడిన సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గంగాధర్, సాంబశివలు డిమాండ్ చేశారు. మంగళవారం రాయచోటిలోని కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా లైసెన్స్ కలిగిన ప్రతి ఆటోడ్రైవరకు వాహనమిత్ర పథకం అని చెప్పి, ఇప్పుడేమో ఓనర్ కమ్ డ్రైవర్‌కు మాత్రమే అని అంటున్నారన్నారు. అందరికీ పథకం వర్తింపచేయాలని కోరారు. కార్యక్రమంలో నాగేశ్వరరావు, ముబారక్, సలీంబాషా, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న యూనియన్ నాయకులు, ఆటోడ్రైవర్లు

టేబుల్ టెన్నిస్‌లో ప్రతిభ



రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపల్

పెనగలూరు : ఎస్‌జీఎఫ్ టేబుల్ టెన్నిస్ పోటీలలో మోడల్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపల్ సహజ బ్లెస్సీ తెలిపారు. 15వ తేదీ ప్రొద్దుటూరులోని జార్జ్ క్లబ్‌లో జరిగిన అండర్-19 పోటీలలో మోడల్ స్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారన్నారు. రాష్ట్రస్థాయికి ఎంపిక కావడంపట్ల ప్రిన్సిపల్‌తోపాటు మోడల్ స్కూల్ ఉపాధ్యాయ బృందం, పీఈటీ సుబ్రమణ్యంలు విద్యార్థులను అభినందించారు.

ఆవిష్కరణలు సమాజానికి ఉపయోగపడాలి



ఎక్స్‌పోను సందర్శిస్తున్న వీసీ సాయిబాబారెడ్డి

రాజంపేట : విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానానికి సృజనాత్మకతను జోడించి సమాజానికి ఉపయోగపడే ఆవిష్కరణలు చేయాలని అన్నమాచార్య యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ డా.సాయిబాబారెడ్డి సూచించారు. ఇంజనీర్స్ డే పురస్కరించుకుని మంగళవారం ఈసీఈ విభాగం ప్రాజెక్టు ఎక్స్‌పోను నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ విద్యార్థులు వినూత్న ప్రోటోటైప్ మోడల్స్‌ను రూపొందించారన్నారు. వీటిలో ఫైర్ డిటెక్షన్ అలారం సిస్టమ్, ఆటోమేటిక్ రైల్వేగేట్ కంట్రోల్ సిస్టమ్, బ్లూటూత్ ఆధారిత డోర్ లాకింగ్ సిస్టమ్‌పై మాడ్యుల్‌తో హోమ్ ఆటోమేషన్ మాడ్యుల్స్ ఆకట్టుకున్నాయన్నారు. కార్యక్రమంలో ఈసీఈ హెచ్ఓడీ జె.చిన్నబాబు, సీనియర్ ఫ్యాకల్టీ డా.సీహెచ్ నాగరాజు, ఫ్యాకల్టీ సభ్యులు నాగనరసయ్యగౌడ్, రవికిషోర్, శివయామిని, చంద్రహాస్‌రెడ్డి, అధ్యాపకురాలు స్వప్న పాల్గొన్నారు.

పీఎం సూర్యఘర్‌పై దృష్టి పెట్టండి



మాట్లాడుతున్న ఏడీ మురళీధర్ రెడ్డి

పెనగలూరు : ప్రధాన మంత్రి సూర్యఘర్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలని విద్యుత్ ఏడీ మురళీధర్ రెడ్డి తెలిపారు. మంగళవారం పెనగలూరు సబ్‌స్టేషన్‌లో మండల విద్యుత్ సిబ్బందితో ప్రత్యేకంగా సమావేశాన్ని ఏర్పాటు చేశారు.ఆయన మాట్లాడుతూ పీఎం సూర్యఘర్‌పై ప్రత్యేక దృష్టి పెట్టి ప్రజల వద్దకు తీసుకెళ్లే విధంగా కృషి చేయాలన్నారు. అలాగే విద్యుత్ పెండింగ్ బిల్లులను రాబట్టాలని తెలియజేశారు. అలాగే విద్యుత్ సమస్యలు పరిష్కరించాలన్నారు. రైతులు, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సిబ్బంది పనిచేయాలని సూచించారు. అనంతరం విద్యుత్ అధికారి ఓబుల్ రెడ్డి మాట్లాడుతూ సబ్ స్టేషన్ పరిధిలో ఉండే విద్యుత్ సిబ్బంది గ్రామాల్లో తలెత్తే సమస్యలను రైతులకు ఇబ్బందులు లేకుండా పరిష్కరించాలని చెప్పారు.

మండలంలో మట్టి దొంగలు



ఇటీవల జిల్లేలమడక చెరువులో అక్రమంగా మట్టిని తరలిస్తున్న హిటాచీని అడ్డుకున్న గ్రామస్తులు




టిప్పర్లలో అక్రమంగా తరలిపోతున్న మట్టి

- అధికార అండతో జిల్లేలమడక చెరువు మట్టిని పక్కదారి పట్టిస్తున్న అక్రమార్కులు
- మామూళ్ల మత్తులో ఇరిగేషన్ అధికారులు

ఓబులవారిపల్లె : కూటమి అధికారంలోకి వచ్చాక మండలంలో తెలుగుదేశం పార్టీ నాయకుల ఆగడాలు నానాటికీ పెరిగిపోతున్నాయి. మండల కేంద్రంలోని జిల్లేలమడక చెరువులో ఎటువంటి అనుమతులు లేకుండా హిటాచీలు, టిప్పర్లతో ఇష్టారాజ్యంగా మట్టిని తరలిస్తూ ధనార్జన చేస్తున్నారు. అయినా ఇరిగేషన్ అధికారులు మాత్రం మామూళ్ల మత్తులో తమకు ఏమీ తెలియనట్టు వ్యవహరిస్తుండటం మండల ప్రజలను అవాక్కు చేస్తోంది. నిబంధనల ప్రకారం చెరువు మట్టిని వ్యవసాయ అవసరాలకు (పొల్లాల్లోనే) మాత్రమే వాడాలి. కానీ అధికారం అండతో పచ్చ పార్టీ నాయకులు మట్టిని ఇటుక బట్టీలకు దూరాన్ని బట్టి తరలిస్తూ టిప్పర్‌కు రూ.4 వేల నుంచి రూ.6 వేలు వరకు వసూలు చేసున్నారు. అక్రమ ఆదాయానికి అలవాటు పడ్డ అధికార పార్టీ నాయకులు నిబంధనలు భేఖాతరు చేస్తూ రాత్రి, పగలు అనే తేడా లేకుండా మట్టిని తరలిస్తున్నారని రైతులు వాపోతున్నారు. ఇప్పటికే చెరువు దాదాపు పూర్తిస్థాయిలో భారీగుంతలతో నీరు ప్రవహించేందుకు లేకుండా పోతోందని ఆయకట్టు రైతులు ఆవేదనకు గురవుతున్నారు. అక్రమంగా మట్టి తరలిస్తుండటంతో రైతులు, రెవెన్యూ అధికారులు పలుమార్లు అడ్డుకున్నా ప్రయోజనం లేకుండా పోతోంది. పరిస్థితి ఇలాగే కొనసాగితే కొన్ని రోజులకే చెరువు కాస్త మైనింగ్ సైట్‌ను తలపిస్తుందని రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి జిల్లేలమడక చెరువు మట్టి పక్కదారి పట్టకుండా రైతుల పొలాలకు చేరేలా చర్యలు తీసుకోవాలని పలువురు రైతులు కోరుతున్నారు. ఈ విషయంపై తహసీల్దార్ యామినీ రెడ్డిని వివరణ కోరగా అనుమతులు లేకుండా అక్రమంగా మట్టిని తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, వాహనాలు సీజ్ చేసి కేసులు పెట్టిస్తామని హెచ్చరించారు.

చదువును నిర్లక్ష్యం చేయవద్దు

రాయచోటి టౌన్ : పట్టుదల, ఏకాగ్రత్తతో విజయం సాధించవచ్చునని మానవత సంస్థ అధ్యక్షులు అంకం జయచంద్రారెడ్డి విద్యార్థులకు సూచించారు. మంగళవారం రాయచోటి పట్టణంలోని భారతి విద్యామందిర్‌లో విద్యార్థులకు నైతిక విలువలపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ నేటి యువత సెల్‌ఫోన్ అనే వ్యసనానికి అలవాటుపడ్డారని, సెల్‌ఫోన్‌కు దూరంగా ఉండాలని అన్నారు. చదువును నిర్లక్ష్యం చేయరాదని, కష్టపడి చదివితే భవిష్యత్తు ఉంటుందన్నారు. మానవత చైర్మన్ అరమాటి శివగంగిరెడ్డి మాట్లాడుతూ చదువుతో పాటు నైతిక విలువులు పాటించాలని తెలియజేశారు. గురువులు, తల్లిదండ్రులు, పెద్దల పట్ల గౌరవ మరాద్యలతో వ్యవహరించాలని సూచించారు. నైతిక విలువలు అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి ప్రతిభ చూపిన వారికి ప్రశంసాపత్రాలతో పాటు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో తిరుపతి మానవత కో-చైర్మన్ మాధవయ్య నాయుడు, వి.రామచంద్రారెడ్డి, బీఏ నాగయ్య, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న మానవత సభ్యులు


ఓజోన్ పొరను పరిరక్షించుకుందాం

అల్ట్రా వైలెట్ కిరణాలు నుంచి భూమిని రక్షించి ఓజోన్ పొరను కాపాడుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఉపాధ్యాయులు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు తెలియజేశారు. మంగళవారం ఓజోన్ పొర పరిరక్షణ దినోత్సవాన్ని పాఠశాలల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఓజోన్ పొర విశిష్టతను వివరించారు. కాలుష్యం కారణంగా ఎలా దెబ్బతింటోందో వివరించారు. ఓజోన్ పొర పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలను విద్యార్థులకు ఉపాధ్యాయులు తెలియజేశారు. అలానే ఓజోన్ పొర లేకుంటే మానవాళి అంతానికి దారితీసే అంశాలను విపులీకరించారు. అనంతరం విద్యార్థులతో అవగాహన ర్యాలీ తీయించి ప్రతిజ్ఞ చేయించారు. సిద్దవటంలో జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు సమీర్ బాషా విద్యార్థులకు అవగాహన కల్పించారు. కాగా ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖన పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు.

– సాక్షి,నెట్‌వర్క్



నందలూరు: అవగాహనా ర్యాలీ నిర్వహిస్తున్న నాగిరెడ్డిపల్లె జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు



పుల్లంపేట: అవగాహన కల్పిస్తున్న టీచర్లు



చిట్వేలి: మండల కేంద్రంలో విద్యార్థుల ర్యాలీ